# మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి

**సంక్షేమ పథకాలకు ఫిదా అవుతున్న ప్రజలు**

**బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి**

**ప్రతి ఇంటికి వెళ్లి మ్యానిఫెస్టోను వివరించాలి**

**శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్**

**ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓటర్లకు వివరించాలి**

**తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

కరీమాబాద్, నవంబర్ 4: మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి కానున్నారని, బీఆర్ఎస్ సర్కారు చేస్తున్న అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు ఫిదా అవుతున్నారని శాసన మండలి డిప్యూటీ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బండా ప్రకాశ్ అన్నారు. ఉర్సు బైపాస్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని డివిజన్లకు చెందిన వంద ఓట్ల బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. మరోసారి తూర్పులో గులాబీ జెండాను ఎగరవేయాలని కోరారు. ప్రజలను కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేసేలా చూడాలన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రూపొందించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రతి గడపకు చేర్చాలన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని వివరించి ఓట్లు అభ్యర్థించాలన్నారు. తూర్పులో బీఆర్ఎస్ విజయం సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు.

**అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలి**

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించాలని ఎమ్మెల్యే నరేందర్ కోరారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరాలన్నారు. వంద ఓట్లకు ఒక బాధ్యుడిని నియమించామని, వారు శక్తి వంచన లేకుండా పని చేసి, మెజారిటీ ఓట్లు సాధించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం నిలిచిపోకుండా ఉండాలంటే మళ్లీ కేసీఆరే సీఎం కావాలనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఖాదీ బోర్డు చైర్మన్ మౌలానా, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

**మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి**

తెలంగాణలోని మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఖిలా వరంగల్ రోడ్డులోని ఈద్గాలో శుక్రవారం రాత్రి అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలోని మైనార్టీలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో హసన్ అలీ బేగ్, మాషుక్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

**బొడ్రాయి వేడుకల్లో..**

వరంగల్ 39వ డివిజన్‌లో చేపట్టిన బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ బొడ్రాయి ఉత్సవ వేడుక నిర్వాహకులు పాల్గొన్నారు.

**ఎల్‌వీఆర్‌నగర్ వాసుల విరాళం**

వరంగల్‌చౌరస్తా/కరీమాబాద్: ఎమ్మెల్యే నరేందర్ విజయాన్ని కాంక్షిస్తూ ఎల్‌వీఆర్‌నగర్ వాసులు ప్రచార ఖర్చుల కోసం విరాళాలు అందజేశారు. వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న ఎల్‌వీఆర్‌నగర్‌లో కాలనీవాసులు శుక్రవారం రాత్రి ప్రచార ఖర్చు కోసం విరాళాలు సేకరించి ఎమ్మెల్యేకు అందజేశారు. ఏళ్ల తరబడి గుడిసెల్లో నివాసముంటున్న తమకు పట్టాలు అందించిన నన్నపునేని గెలుపునకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. నగరం నడిబొడ్డున గుడిసెవాసులుగా ఉన్న తమకు గత ప్రభుత్వాల హయాంలో కనీస వసతులు కల్పించలేదన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నరేందర్ ఆధ్వర్యంలో తమకు కరెంటు, తాగునీటి వసతి కల్పించడంతోపాటు రోడ్లు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో 27వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, 41వ డివిజన్‌కు చెందిన చిన్నారులు లాస్య, విహారిక, గగన్ శౌర్య తమ పాకెట్ మనీని ఎమ్మెల్యేకు విరాళంగా అందజేశారు.

## గ్యార్మీ షరీఫ్ వేడుకల్లో పాల్గొన్న నన్నపునేని

పోచమ్మమైదాన్, నవంబర్ 4: వరంగల్ ఆటోనగర్‌లో జరిగిన గ్యార్మీ షరీఫ్ వేడుకల్లో తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక నాయకులు ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూసుఫ్ జాహిద్ అలీ, ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు కె.కన్నయ్య, జనరల్ సెక్రటరీ రియాజుద్దీన్, ప్రవీణ్, రాజు, సాదిక్, అథర్, నవాబ్, ఖాసీం, ఖలీం పాల్గొన్నారు.

## 12 నుంచి కార్తీక మాసోత్సవాలు

పోచమ్మమైదాన్, నవంబర్ 4: వరంగల్ మట్టెవాడలోని రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 12 నుంచి 17 వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఆరు రోజులపాటు ఆలయంలో జరుగనున్న కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## వరంగల్ నాయబ్ తహసీల్దార్ రేణుక బదిలీ

పోచమ్మమైదాన్, నవంబర్ 4: వరంగల్ నాయబ్ తహసీల్దార్ కె.రేణుక బదిలీ అయ్యారు. ఈ మేరకు కలెక్టర్ ప్రావీణ్య శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్‌లో పని చేస్తున్న ఆమె డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై ఆఫీసులో డీటీగా పని చేయనున్నారు. ఎన్నికల నేపథ్యంలో దీర్ఘకాలికంగా పని చేస్తున్న అధికారుల బదిలీల్లో భాగంగా ఆమెను బదిలీ చేశారు.

## ఎన్నికల్లో సీజ్ చేసిన నగదు విడుదల

ఖిలావరంగల్, నవంబర్ 4: ఎన్నికల్లో సీజ్ చేసిన నగదుతోపాటు ఇతర వస్తువులను గ్రీవెన్స్ కమిటీ ద్వారా విడుదల చేసినట్లు జిల్లా గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ బీ సంజీవరెడ్డి తెలిపారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 53 కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ. 1,15,44,170 నగదును తగిన ఆధారాలను పరిశీలించి తిరిగి బాధితులకు అందజేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదు కాని ఇతర వస్తువులకు సంబంధించిన రసీదులు ఉంటే వెంటనే విడుదల చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# కాకతీయ మెడికల్ కళాశాలకు మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ రీజినల్ సెంటర్

- మరింత మెరుగుపడనున్న వైద్య విద్యా ప్రమాణాలు
- కేఎంసీలో త్వరలోనే అందుబాటులోకి రానున్న సేవలు




వరంగల్‌చౌరస్తా, నవంబర్ 4: హెల్త్ హబ్‌గా మారుతున్న వరంగల్‌లోకి మరో కలికితురాయి చేరనుంది. కాకతీయ మెడికల్ కళాశాలకు అరుదైన ఘనత దక్కనుంది. రాష్ట్రంలో మూడో మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ రీజినల్ సెంటర్ కేఎంసీలో ఏర్పాటు చేయనున్నారు. వైద్య విద్యా ప్రమాణాల పెంపు కోసం నేషనల్ మెడికల్ కమిషన్ మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ రీజినల్ సెంటర్‌ను కేఎంసీలో ఏర్పాటు చేయనుంది. ఇటీవల నేషనల్ మెడికల్ కమిషన్ ప్రతినిధుల బృందం నిర్వహించిన ఆన్ సైట్ తనిఖీల్లో 2017లో ఏర్పాటు చేసిన మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ పనితీరు, మౌలిక వసతులను పరిశీలించిన బృందం సభ్యులు.. ప్రాంతీయ వైద్య విద్యా సాంకేతిక కేంద్రాన్ని (మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ రీజనల్ సెంటర్) కేఎంసీలో ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. సేవలను ప్రారంభించిన అనంతరం ఆరు నెలలపాటు పనితీరును పరిశీలించిన తదుపరి పూర్తిస్థాయి సేవల కొనసాగింపుకు అనుమతిస్తారు. దీనికి సంబంధించి విభాగానికి కేటాయించిన భవన వివరాలతోపాటు మూడేళ్ల కాలపరిమితితో నియామకమయ్యే కన్వీనర్, కో-కన్వీనర్ల పూర్తిస్థాయి సమాచారాన్ని ఈ నెల 8వ తేదీలోగా అందించాలని కమిషన్ కోరినట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ తెలిపారు. వివరాలను పరిశీలించిన తదుపరి రీజినల్ సెంటర్ పరిధులను ఏర్పాటు చేసి, అందులోని కళాశాలలను ఈ కేంద్రానికి అనుసంధానం చేస్తారని పేర్కొన్నారు. ఈ రీజినల్ సెంటర్ ద్వారా వైద్య విద్యా బోధన చేస్తున్న అధ్యాపకులు ప్రపంచవ్యాప్తంగా వైద్య రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక సాంకేతికను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. తద్వారా విద్యాభ్యాస సమయంలోనే వైద్య విద్యార్థులు నూతన శాస్త్ర, సాంకేతికను అందిపుచ్చుకునే వీలు కలుగుతుందన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని 2017లో ఏర్పాటు చేసిన మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ పనితీరు మూలంగా ఈ కేంద్రం అందుబాటులోకి రానుందన్నారు. గతంలో వైద్య బోధన చేసే సిబ్బంది హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ తరగతుల్లో పాల్గొని, విద్యార్థులకు నూతన సాంకేతికతను వివరించే వారన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో భవిష్యత్‌లో కేఎంసీ ఉన్నతస్థానంలో నిలిచేందుకు ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. నేషనల్ మెడికల్ కమిషన్ కోరిన వివరాలను త్వరలో వారికి అందించి, తాత్కాలిక అనుమతులు పొందడంతోపాటు రానున్న ఆరు నెలల కాలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి శాశ్వత అనుమతులు పొందేందుకు కృషి చేస్తామని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

- అభ్యర్థులు పరిశీలించుకునేందుకు ఓటరు జాబితాను అందుబాటులో ఉంచాలి
- ప్రతి అభ్యర్థి అన్ని కాలమ్స్ పూరించేలా చూడాలి
- ఎన్నికల వ్యయ పరిశీలకుడు అమిత్ ప్రతాప్‌సింగ్



తూర్పు రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషాతో సమీక్షిస్తున్న అమిత్ ప్రతాప్ సింగ్

వరంగల్, నవంబర్ 4: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు అమిత్ ప్రతాప్ సింగ్ ఆదేశించారు. తూర్పు నియోజకవర్గంలోని అభ్యర్థులు నామినేషన్లు వేస్తున్న గ్రేటర్ కార్పొరేషన్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. తూర్పు నియోజవర్గం రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా ఆయనకు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యయ పరిశీలన సెల్‌లో అభ్యర్థుల నమోదు వివరాలను ఆయన పరిశీలించారు. వ్యయ నమోదు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు వేసే నామినేషన్‌లోని ప్రతి డాక్యుమెంట్‌ను నిశితంగా పరిశీలించాలన్నారు. నామినేషన్ వేసిన నాటి నుంచి ఎన్నికలు ముగిసే వరకూ అభ్యర్థుల ఖర్చులను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థుల ఖర్చులను పార్టీ పేరుతో ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. స్వతంత్ర అభ్యర్థుల ఖర్చులను షాడో రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులకు ఫారం-2బీ పత్రాలను రిటర్నింగ్ కార్యాలయంలో ఉచితంగా అందజేయాలన్నారు. నియోజవర్గానికి చెందిన ఓటరు జాబితాను అభ్యర్థులు పరిశీలించుకునేందుకు పోలింగ్ కేంద్రం వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఓటరు జాబితాను పరిశీలించేలా ఏర్పాటు చేయాలన్నారు.

**సిబ్బందికి సహకరించాలి**

నామినేషన్ విషయంలో సిబ్బంది సహకరించాలని, అన్ని కాలమ్‌లను పూరించేలా చూడాలని అమిత్ ప్రతాప్‌సింగ్ సూచించారు. ఏదైన కాలమ్‌లో పూరించాల్సింది ఏమీ లేనప్పుడు లేదు/వర్తించదు అని కచ్చితంగా రాసేలా చూడాలన్నారు. సెక్యూరిటీ డిపాజిట్ అనంతరం రిటర్నింగ్ అధికారికి అభ్యర్థి నామినేషన్ పత్రాలు అందజేసేప్పుడు అనెగ్జర్-19, ఫార్మాట్-26, అఫిడవిట్, బ్యాంకు ఖాతా, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటోలు, ఇతర నియోజవర్గానికి చెందిన వారతై వాటి ఓటు వివరాలు తెలిపే సర్టిఫైడ్ కాపీ, అభ్యర్థి పోటీ చేసే పార్టీ గుర్తు తెలిపారా అనే అంశాలను కచ్చితంగా పరిశీలించాలన్నారు. నామినేషన్ తర్వాత పరిశీలన తేదీ తెలుపాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, జిల్లా వ్యయ పరిశీలకుడు, నోడల్ అధికారి సంజీవరెడ్డి, సహాయ వ్యయ పరిశీలనాధికారి మానస, డీపీఆర్వో అయూబ్ అలీ, తహసీల్దార్ ఇక్బాల్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

**ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి**

ఎన్నికల నిబంధనల్లో భాగంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అమిత్ ప్రతాప్ సింగ్ ఆదేశించారు. శనివారం ఆయన క్షేత్రస్థాయిలో వాహన తనిఖీలను పరిశీలించారు. ఎంజీఎం, గొర్రెకుంట క్రాస్‌రోడ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను సందర్శించిన ఆయన స్టాటస్టికల్ సర్వేలెన్స్ బృందాల పనితీరు, వాహన తనిఖీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించేందుకు గట్టి నిఘా పెట్టాలన్నారు. డబ్బు, మద్యం, వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యయ పరిశీలకుడు సంజీవరెడ్డి, స్టాటస్టికల్ సర్వేలెన్స్ బృందాల బాధ్యులు యూసుఫొద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది కృష్ణమూర్తి, కుమారస్వామి పాల్గొన్నారు.